క్లుప్తంగా

స్వామిఅమ్మవార్లకు పౌర్ణమి పూజలు


స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ..


స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

ఆటో బోల్తా .. 12 మందికి గాయాలు


కూలీలకు చికిత్స నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు సమీపంలో శనివారం ఆటో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది వ్యవసాయ కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వెలుగోడు నుంచి మిడుతూరు గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలో దాదాపు 12 మంది కూలీలు బయలు దేరారు. రోళ్లపాడు సమీపంలో ఆటో బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.

గుండెపోటుతో తలారి మృతి


సవారయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన తలారి నేరెడు సవారయ్య(74) గుండెపోటుతో మృతి చెందాడు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సవార య్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందాడు. ఈ మేరకు తహసీల్దార్ ఉమారాణి శనివారం గ్రామం చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు అందజేశారు.

25 నుంచి ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

పాములపాడు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని చెలిమిల్ల గ్రామంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ సంఘ పెద్దలు తెలిపారు. విజేత జట్లకు రూ. 30 వేలు, రూ. 20వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు, రూ. 4 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈ నెల 24వ తేదీలోపు ప్రవేశ రుసుం రూ.400 చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని వివరించారు.

వైభవంగా దత్తజయంతి

వెలుగోడు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పురోహితుడు మురళీ శర్మ ఆధ్వర్యంలో బాబాకు కాకడ హారతి, విష్ణు సహస్రనామావళి అభిషేకం, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతి, భజన, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం దత్త జయంతి వేడుకలు కను పండువగా జరిగాయి. ఉదయం స్వామివారికి కాగడ హారతి, గణపతిపూజ, నవవిధ అభిషేకాలు, పుష్పార్చన, భక్తులచే దత్త ప్రదక్షిణ, సాయిసత్యవ్రతం, మధ్యాహారతి నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, రాత్రి పల్లకిసేవ, శ్రీజ హారతి తదితర పూజలు చేశారు. భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయుల పోటాపోటీ
- పరస్పర ఆరోపణలతో దాడులకు యత్నం
- 12 టీసీలలో 7 ఏకగ్రీవం
- 3 టీసీలకు తీవ్ర పోటీ, 2 టీసీల ఎన్నిక వాయిదా
- చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకున్న ఎంపీ వర్గీయులు


వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయులు


టీసీ నామినేషన్ల వివాదంపై ఆరా తీస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి సారి నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుల మధ్య కుంపటి రాజేసింది. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ బందోబస్తు మధ్య జరిగిన పగిడ్యాల నీటి వినియోగదారుల సంఘం 4 ఎన్నిక ఉద్రిక్తతలకు దారి తీసింది. పోటీ చేసే అభ్యర్థులు, ఓటు వేసే ఓటర్లు ఉదయం 9 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని ఎన్నికల అధికారులు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఎమ్మెల్యే వర్గీయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పలుచాని మహేశ్వరరెడ్డి ఆలస్యంగా 9.30 గంటలకు పోలింగ్ కేంద్రానికి ఓటర్లను, అభ్యర్థులను తీసుకొచ్చారు. దీంతో ఎంపీ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఇరువర్గీయులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ దాడులకు యత్నించారు. గమనించిన నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఇరువర్గాలను చెదరగొట్టారు. 1, 2, 3, 6, 7, 12 టీసీలు ఏకగ్రీవం కాగా 4, 5, 8 టీసీలకు గట్టి పోటీ నెలకొంది. 10 టీసీకి నామినేషన్ వేసిన దండు నవీన్‌నాయుడు నామినేషన్‌ను నీటి పన్ను, నో డ్యూస్, ప్రతిపాదిత వ్యక్తులు లేరని పీఓ గణేష్ నామినేషన్ పరిశీలించి తిరస్కరించారు. అలాగే 11వ టీసీకి నామినేషన్ వేయడానికి అభ్యర్థులు నామినేషన్ గడువు ముగిసాక ఎంపీ వర్గీయులు, ఎమ్మెల్యే వర్గీయులను అడ్డుకుని హల్‌చల్ చేశారు. ఇరువర్గాలకు సర్ది చెప్పడానికి సీఐ ఆపసోపాలు పడ్డారు. ఎట్టకేలకు ఎంపీ వర్గీయులు 6 టీసీలు, ఎమ్మెల్యే వర్గీయులు 4 టీసీలు గెలువగా, 10, 11 టీసీలను ఎన్నికల అధికారులు రద్దు చేశారు. అత్యధిక టీసీలు గెలుచుకున్నా ఎంపీ వర్గీయుల్లోనే చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా తలముడిపి చిన్నస్వామి, బొబ్బిటి నాగేశ్వరరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ:

శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఆర్డీఓ నాగజ్యోతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయుల మధ్య 10, 11 టీసీలలో అభ్యర్థుల నామినేషన్‌లు వివాదాస్పదమైంది. వివాదంపై ఎన్నికల అధికారి ఈఓఆర్డీ నాగేంద్రయ్య, తహసీల్దార్ శివరాముడులతో ఆర్డీఓ ఆరా తీశారు. ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని అధికారులకు ఆదేశించి పోలింగ్ ముగిసే వరకు ఉన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

కొత్తపల్లి:మండలంలో శనివారం సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉమారాణి, మహేష్, జుబేర్, సాగర్, మేరి, సువర్ళలల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ కేశవలు పటిష్ఠ భద్రత చేపట్టారు. మండలంలో మొత్తం 54 టీసీ(టెరిటోరియల్ కాన్స్‌యన్స్)లకు ఎన్నికలు జరుపగా 47 ఏకగ్రీవం కాగా 3 కు ఓటింగ్ నిర్వహించారు. మరో 4 టీసీలకు నామినేషన్లు రాకపోవడంతో ఎన్నికలు వాయిద పడ్డాయి. గువ్వలకుంట్లలో 12 టీసీలలో ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయులు 6, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గీలు 6 టీసీలలో గెలుచుకోగా మధ్యాహ్నం జరగాల్సిన ప్రసిడెంట్, వైస్ ప్రసిడెంట్ ఎన్నికల కోరంలేక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి సువళ్ళల తెలిపారు. అదేవిధంగా కొత్తపల్లిలో 12 టీసీలు ఉండగా 8 ఏకగ్రీవం కాగా 4 కి ఎన్నికలు జరగలేదు, కోరం లేదని ప్రసిడెంట్, వైస్ ప్రసిడెంట్ ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

కోరం ఉన్నా ఎన్నికలు ఎందుకు వాయిదా వేశారు..

కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాలలోని టీసీలకు ప్రసిడెంట్, వైస్‌ప్రసిడెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు కోరం ఉన్నా కూడా అధికారులు ఎందుకు ఎన్నిక వాయిదా వేశారని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే అధికారులు ఎన్నికలు వాయిదా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కోరం ఉన్నా ప్రసిడెంట్, వైస్‌ప్రసిడెంట్ ఎన్నికలు వాయిదా వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా సాగు నీటి సంఘం ఎన్నికలు

పాములపాడు: సాగు నీటి సంఘం ఎన్నికలు శనివారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 48 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. డబ్ల్యూయూఏ ఎన్నిక మూజువాణి పద్ధతిలో నిర్వహించారు. వేంపెంట చైర్మన్ ఆల్‌ఫ్రెడ్, వైస్‌చైర్మన్ లక్ష్మీశ్వర్, వాడాల చైర్మన్ శంకర్, వైస్ చైర్మన్ శ్రీనివాసులు, మద్దూరు చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్ జయరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాములపాడు డబ్ల్యూయూఏ ఎన్నికలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య పోటీ నెలకొంది. ఎమ్మెల్యే వర్గంలో 7 మంది, ఎంపీ వర్గీయులు 5 మంది టీసీలు ఉన్నారు. కాగా ఎమ్మెల్యే వర్గానికి చెందిన నలుగురు అసమ్మతి టీసీలు ఎంపీ వర్గం వారితో చేతులు కలిపారు. దీంతో ఎమ్మెల్యే వర్గీయుడు పింజరి చిన్న గోకారిని చైర్మన్, ఎంపీ వర్గీయుడు కురువ వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కాగా ఈ ఎన్నిక పై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో నోడల్ ఆఫీసర్ డీఈ ప్రసాదరావు పోలింగ్ కేంద్రానికి చేరుకొని మరలా ఎన్నిక నిర్వహించారు. కాగా 8 ఓట్లతో మళ్లీ చిన్నగోకారి, వెంకటేశ్వర్లు గెలుపొందారు.

ఉత్కంఠంగా సాగిన కేసీకాల్వ సాగునీటిసంఘం ఎన్నికలు

జూపాడుబంగ్లా: మండలంలోని కేసీ కాల్వ సాగునీటిసలహా సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షున్ని ఎన్నుకొనే వరకు ఎన్నికలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. శనివారం జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేసీ కాల్వ ఆయకట్టు రైతు ఓటర్లతో సాగునీటిసలహాసంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మాండ్రవర్గానికి చెందిన 80బన్నూరు పరమేశ్వరరెడ్డి, పగిడ్యాల మండలం, ఘణపురం గ్రామానికి చెందిన చంద్రేస్ సాగునీటిసలహా సంఘం అధ్యక్ష స్థానం కోసం పోటీపడ్డారు. మాండ్రచెప్పినందున తమ మద్దతు చంద్రేస్‌కే అంటూ 10మంది టీసీ మెంబర్లు వెల్లడించారు. టీసీ మెంబర్ల ఎన్నిక అనంతరం అధ్యక్ష పదవి ఎవ్వరికన్నది టీసీ మెంబర్లు, అక్కడికొచ్చిన రైతులందరిలో అయోమయం నెలకొంది. అధ్యక్ష స్థానం తనకంటే తనకంటూ పరమేశ్వరరెడ్డి, చంద్రేస్ వెల్లడించారు. మధ్యాహ్నం 3గంటల కు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎంపీడీఓ గోపికృష్ణ 12మంది టీసీ మెంబర్లను ఓ గదిలో కూర్చోబెట్టి కేసీ కాల్వ సాగునీటి సలహా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మొదట అధ్యక్షునిగా పోటీచేస్తున్న పరమేశ్వరరెడ్డికి ఎంత మంది మద్దతు ఇస్తున్నారో చేతులు ఎత్తాలని పీఓ కోరగా 12మంది టీసీ మెంబర్లలో 10మంది చేతులు ఎత్తి వారి మద్దతు ప్రకటించారు. అనంతరం వైఎస్ చైర్మన్ చంద్రేస్‌కు ఎంత మంది మద్దతు ఇస్తున్నారో చేతులు ఎత్తాలని పీఓ కోరడంతో ఆయనకు 10మంది టీసీ మెంబర్లు చేతులు ఎత్తి మద్దతు తెలపటంతో ఉత్కంఠతకు తెరపడింది.

ఆరు టీసీలు ఏకగ్రీవాలు

నందికొట్కూరు: నియోజకవర్గంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరపకుండా అధికారం అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు, బెదరింపులకు పాల్పడినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో మాండ్ర శివానందరెడ్డి, బైరెడ్డి రాజశేఖరరెడ్డి వర్గీయుల మధ్య ప్రధానంగా పోటీ జరిగింది. అయితే మాండ్ర వర్గానికి చెందిన టీసీలే అధిక సంఖ్యలో విజయం సాధించినట్లు సమాచారం. మండలంలోని మూర్వకొండ సాగునీటి ఎన్నికల్లో ఆరు టీసీలు ఏకగ్రీవాలు అయ్యాయి. మిగత ఆరు టీసీలకు మండలంలోని కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలను డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు పరిశీలించారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు జరిగాయి. మండలంలో 8 సాగునీటి సంఘాల ఎన్నికల్లో 7 సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బైర్లూటి సాగునీటి సంఘం ఎన్నికలకు కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. మిగిలిన ఏడు స్థానాల్లో ఏకగ్రీవం జరగగా, అందరూ టీడీపీ మద్దతుదారులే పదవులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, ఇరిగేషన్ జేఈఈ మురళీకృష్ణతో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడులో..

వెలుగోడు: వెలుగోడు మండలంలో శనివారం నిర్వహించిన 12 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ తెలిపారు. టీడీపీ మద్దతుదారులే పదవులు దక్కించుకున్నారు.

బండి ఆత్మకూరు : సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల పరిధిలో మొత్తం 24 సాగునీటి సంఘాలు ఉండగా, 216 టీసీలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. టీడీపీ మద్దతుదారులే పదవులను దక్కించుకున్నారు.

మహానంది: మహానంది మండలంలోని నాలుగు చెరువులు, ఐదు తెలుగుగంగ బ్లాక్‌లకు నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులకు శనివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఎన్నికలను బహిష్కరించిన జలకనూరు రైతులు


తలముడిపిలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

మిడుతూరు: మండల పరిధిలోని జలకనూరు ఎంఐ టాంక్(మద్దిగుండం చెరువు) నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలను రైతులు బహిష్కరించారు. తలముడిపి గ్రామ పరిధిలోని ఎర్ర చెరువు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఎమ్మెల్యే వర్గం ఎన్నిక నిర్వహించొద్దని, ఎంపీ వర్గం ఎన్నిక నిర్వహించాలని భీష్మించారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ గ్రామానికి చేరుకొని ఇరువురి వాదనలు విన్నారు. ఎర్రచెరువులో నీటి వనరులు లేవని, ఎన్నికలు ఎందుకని ఎమ్మెల్యే వర్గం, ఎన్నికలు నిర్వహించిన తర్వాత సమస్యను పరిష్కరించుకుందామని ఎంపీ వర్గం వాగ్వాదానికి దిగారు. ఈ రెండు చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. విషయాన్ని ఆర్డీఓ, జేసీ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

జలకనూరు ఎంఐ టాంక్(మద్దిగుండం చెరువు) ఎన్నిక బహిష్కరించిన రైతులు

జలకనూరు గ్రామంలో అందరూ రైతులు కలిసి ఎంఐ టాంక్ నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఎంఐ టాంక్‌లో నీటిని సుంకేసుల గ్రామస్తులు విద్యుత్ మోటార్లకు అక్రమ కనెక్షన్లు పొంది నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని , సమస్య పరిష్కరించేంతవరకు ఎన్నికలు బహిష్కరిస్తున్నామని రైతుల తేల్చిచెప్పారు.


ఎన్నికలు బహిష్కరిస్తున్నామంటూ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తజన సందడి నెలకొంది. ఈ మేరకు వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వేకువజామున నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా), శ్రీనివాసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తజనం

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానందీశ్వరుడి దంపతులకు శనివారం నిత్య కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. భక్తులు స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గబ్బర్‌సింగ్ ద్వారా మంచి గుర్తింపు

మహానంది: గబ్బర్‌సింగ్ చిత్రం ద్వారా తనకు మంచి గుర్తింపు లభించిందని సినీ నటుడు శివమ్ తెలిపారు. నంద్యాలలోని ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన శనివారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం పూజలను చేసుకున్నారు. ఆయనను గుర్తించిన స్థానికులు ఫొటోలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విలన్ పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో గుర్తింపు ఉందన్నారు. మహానంది ఆలయ పరిసరాలు ఎంతో బాగున్నాయని కొనియాడారు.


మహానందికి వచ్చిన నటుడు శివమ్

ప్రీమియర్ లీగ్ విజేత ఛత్రపతి వారియర్స్



విజేత జట్లకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం



శ్రీశైలం: శ్రీశైలం మెగా ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మొత్తం 14 ఫ్రాంచైజ్ టీంలు పోటీపడగా ఛత్రపతి వారియర్స్ విజేతగా నిలిచింది. ఛత్రపతి టీమ్, ఆర్ఆర్ టీంలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ మేరకు శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో ఛత్రపతి వారియర్స్ విజేతగా నిలిచి రూ.లక్ష, షీల్డ్ గెలుచుకున్నారు. అదేవిధంగా రన్నర్స్‌గా ఆర్ఆర్ ఎలెవెన్ జట్టు క్రీడాకారులు రూ.50 వేలు, షీల్డ్‌ను అందుకున్నారు. మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు స్పాన్సర్లు అయిన బీజేపీ జిల్లా కార్యదర్శి దొంతిరెడ్డి అరవింద రెడ్డి, శ్రీశైలం జనసేన నాయకులు రౌతు అశోక్ కుమార్, డాక్టర్ శివకుమార్, డి కొండాలు విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజర్ బాబురావు స్పాన్సర్లను సత్కరించారు.

కేసీ కాల్వలో తగ్గిన నీటిమట్టం

జూపాడుబంగ్లా: సుంకేసుల డ్యామ్‌లో 1.2 టీఎంసీల నీటిమట్టం ఉండగా కేసీ కాల్వకు 1,465 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. కేసీ కాల్వకు సరఫరా అవుతున్న నీటిని రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 919క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 481క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 300క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 138క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.


కేసీకాల్వలో తగ్గిన సాగునీరు

జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 150 కేసులు రాజీ


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 150 కేసుల్లో కక్షిదారుల మధ్య రాజీ కుదిరి కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి వడ్డే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు, వెలుగోడు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదైన పలు కేసులను పరిష్కరించారు. బ్యాంకులకు సంబంధించి 24 కేసులు, ఎనిమిది మున్సిపల్ కేసులు, 71 ఎస్టీసీ కేసులు, 24 ఎక్సైజ్ కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే ఐపీసీ కేసులు 23 రాజీ చేశారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో న్యాయవాదులు వెంకటేశ్వర్లు, బలరాం నాయక్, నగేష్, మాణిక్యరావు, టైపిస్టు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

310 కేసులు పరిష్కారం

నందికొట్కూరు: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో 310 కేసులు పరిష్కారం చేసినట్లు కర్నూలు సీనియర్ సివిల్ జడ్జి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అందరి సహకారంతో 310 కేసులు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. సివిల్ కేసులు–17, భార్యభర్తల కేసులు–3, ఎక్సైజ్ శాఖ కేసులు–21, పెట్టీ కేసులు–207, ఐపీ–1, ఐపీసీ–57 కేసులు పరిష్కరించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు, బ్యాంక్ అధికారులు, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


పట్టుబడిన దొంగ అరెస్టును చూపుతున్న సీఐ రాము

ఆత్మకూరు: పట్టణంలో ఈనెల 7వ తేదీన జరిగిన చోరీ కేసును ఛేదించినట్లు సీఐ రాము తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన దొంగను, స్వాధీనం చేసుకున్న ప్రాపర్టీని చూపుతూ వివరాలను సీఐ వెల్లడించారు. ఈనెల 7వ తేదీన సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో నివాసముంటున్న వి.ఆదిలక్ష్మి ఇంటికి తాళం వేసి వారి బంధువుల శుభకార్యానికి వెళ్లారు. గమనించిన దొంగ షేక్‌ఖాదర్ బాషా (అలియాస్ గుండు) తాళం పగలగొట్టి బీరువాలోని 1.75 గ్రాముల నాలుగు బంగారం ఉంగరాలు, ఆరు జతల బంగారం కమ్మలు, 10 గ్రాముల బంగారు చైన్, 10 తులాల వెండి పట్టీలు, డిస్టిన్ మోటార్ సైకిల్ (ఏపీ39ఓయూ–0091) దొంగలించాడన్నారు. 9వ తేదీన ఇంటికి చేరుకున్న బాధితురాలు ఆదిలక్ష్మి వెంటనే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ హుసేన్‌బాషా దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఎట్టకేలకు శనివారం దొంగను పట్టుకుని, రూ.1.45 లక్షలు విలువ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐలు హుసేన్‌బాషా, వెంకటనారాయణ, సిబ్బంది, ఏఎస్ఐ సంజీవుడు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, మౌలాలి, లక్ష్మణ్, మదార్‌సాహెబ్, శివరాముడు, రవికుమార్‌ను సీఐ అభినందించారు.

17 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జూపాడుబంగ్లా: మండంలో ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. 17వ తేదీన తూడిచెర్ల గ్రామంలోని హనుమాన్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక ఆధార్ సెంటర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18న పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 19న 80బన్నూరు గ్రామ సచివాలయం, 20వ తేదీన తాటిపాడు గ్రామసచివాలయంలో ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. తగిన ఆధారాలతో ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చని సూచించారు.